క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



వలగొండలో కాళికాదేవి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి

ఆస్పరి: మండలంలోని వలగొండ గ్రామంలో గురువారం ధ్వజ స్తంభం, కాళికాదేవి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కాళికాదేవిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ముత్తుకూరు సర్పంచ్ తోయజాక్షప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దయ్య, శివారెడ్డి, శివానంద, వేణుగోపాల్, రాజేంద్ర, చంద్ర, ఉశేని పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆలూరు: పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకలను మాలధారులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. అంతకు ముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభోత్సవం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో గాదిలింగేశ్వరస్వామి ముఖ ద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా భీరప్ప దేవస్థానం నుంచి కలశాలతో ఊరేగింపుగా ముఖ ద్వారం వరకు చేరుకున్నారు. అక్కడ పూజలు చేసి ముఖ ద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ఆడపడుచులకు ఒడిబియ్యం నింపారు. మహిళలు గాదిలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నాణ్యత లేకపోతే చర్యలు

మద్దికెర : ఉపాధి నిధులతో వేసిన సీసీ రోడ్లు, గోకుల షెడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాధర్ అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో వేసిన సీసీ రోడ్ల నాణ్యతను పరిశీలించారు. కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలన్నారు. నాణ్యత వివరాలను జిల్లా అధికారులకు పంపుతామని చెప్పారు. రిపోర్టులను బట్టి బిల్లులు మంజూరు చేస్తారన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ శిరీషా, ఈసీ రాఘవేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆలూరు రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎల్లార్తి రోడ్డులోనున్న మురుగు నీటి కుంట, కాలువల్లో సిబ్బందితో ఆయిల్ బాల్స్ వేయించారు. ఆయన మాట్లాడుతూ.. పరిసరాలల్లో మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయడం వల్ల పారిశుద్ధ్యం లోపించి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. మురుగు నీరు రోడ్లపై వదలకుండా వ్యక్తిగత ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

హత్య కేసు నిందితుల అరెస్ట్

తుగ్గలి: గత నెల 27న రాంపల్లిలో జరిగిన ఏకాశి సరోజ (49) ఉరఫ్ శారద హత్య కేసులో నిందితులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పత్తికొండ సీఐ పులిశేఖర్, తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తితో కలిసి వివరాలు వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ.. హత్యకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. సరోజను భర్త ఏకాశి రామానాయుడు మరో ఇద్దరి సహకారంతో హత్య చేసినట్లు వెల్లడైందన్నారు. భార్యపై అనుమానంతో అదే గ్రామానికి చెందిన బుచ్చి రామాంజి, మద్దికెర లాలప్ప సహకారంతో కత్తితో పొడిచి, నరికి హత్య చేశారని చెప్పారు. చక్రాళ్ల క్రాస్ రోడ్డులో ఉండగా నిందితులను అరెస్ట్ చేసినట్లు వివరించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



పత్తికొండలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పత్తికొండ(తుగ్గలి) : అన్నమయ్య జిల్లా రాయచోటి ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ టీచర్ మహమ్మద్ ఏజియాస్ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఫ్యాప్టో జిల్లా శాఖ పిలుపు మేరకు పట్టణంలోని నాలుగు స్తంభాల కూడలిలో సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయుడి మృతిపై వాస్తవాలను వెలికి తీసి బాధ్యులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని నాయకులు సత్యనారాయణ, రామ్మోహన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, సరస్వతమ్మ, రేష్మ, రుద్రమదేవి, చంద్రశేఖర్, బలరాం, నాగభూషణం పాల్గొన్నారు.

హాస్టల్.. వసతులు నిల్!

- ఇంగళదహాళ్ బీసీ హాస్టల్‌లో విద్యార్థుల అవస్థలు
- ప్రమాదకరంగా గదులు
- కాలకృత్యాలకూ కష్టమే
- రాత్రిళ్లు పక్కనే ఉన్న పాఠశాలలో నిద్ర
- వర్షాకాలంలో తలదాచుకునేందుకూ నీడ కరువు
- 260 సీట్లకు గానూ 138 మందికే ప్రవేశం

శిథిలమైన గదులు.. కాలకృత్యాలు తీర్చుకునేందుకూ పనికిరాని బాత్‌రూంలు.. తుప్పుపట్టిన మంచాలు.. ఆరుబయట స్నానాలు.. మురుగుతో పరిసరాలు దుర్గంధం.. గదులు పెచ్చులూడుతుండటంతో రాత్రిళ్లు ఉన్నత పాఠశాలలో నిద్ర.. ఈ ఉపమానమంతా జైలు గురించి కాదండీ.. ఇంగళదహాళ్ బీసీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు. అసౌకర్యాలు వేధిస్తున్నప్పటికీ పేద విద్యార్థులు తమ బాధలను బయటకు చెప్పుకోలేక అభ్యసనను కొనసాగిస్తున్నారు. ఇక కాస్మోటిక్ చార్జీలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు ఇవ్వక పోవడంతో సొంతంగా తెచ్చుకుంటున్నారు.

హొళగుంద : మండలంలోని ఇంగళదహాళ్‌లో 1982లో ఏర్పాటు చేసిన బీసీ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. గదులు, బాత్ రూంలు, మరుగుదొడ్లు పెచ్చులూడుతుంటంతో విద్యార్థులు అనుక్షణం బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులకు వసతితో కూడిన విద్యనందించేందుకు ఏర్పాటు చేసిన హాస్టళ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అరకొర సదుపాయాలు సైతం వారికి అందడం లేదు. అయినా అసౌకర్యాల నడుమ తమ అభ్యసనను సాగిస్తున్నారు.

హైస్కూల్ గదుల్లో నిద్ర

వసతి గృహంలో 13 గదులు ఉండగా..కేవలం రెండు గదులు మాత్రమే కొంత బాగున్నాయి. మిగిలినవి పెచ్చులూడి ప్రమాదకరంగా మారడంతో చదువుకునేందుకు, నిద్రించేందుకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో తలదాచుకునేందుకు పక్కనే ఉన్న పాఠశాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి. వర్షం వచ్చిన రోజు రాత్రంతా పిల్లలు జాగరణ చేయాల్సిందే. గదులు మురుస్తుండటంతో పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పరుగులు తీస్తున్నారు. శిథిలమైన భవనాల్లో నిద్రించడానికి భయపడి ప్రస్తుతం తమ మకాంను ఉన్నత పాఠశాలకు మార్చారు. అక్కడే అన్ని చేసుకుంటున్నారు. ఇక హాస్టల్‌లో 22 మరుగుదొడ్లు, 10 స్నానపు గదులు ఉన్నప్పటికీ.. అవి ఉపయోగించడానికి పనికాని విధంగా తయారయ్యాయి. దీంతో ఆరుబయటే కాలకృత్యాలు, స్నానాలు చేస్తున్నారు.



ఇంగళదహాళ్ బీసీ హాస్టల్



హైస్కూల్ గదిలో నిద్రపోతున్న విద్యార్థులు

అందని కాస్మోటిక్ చార్జీలు, ఇతర సదుపాయాలు..

హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతున్నా ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు కాస్మోటిక్ చార్జీలు, ట్రంకు పెట్టెలు, ప్లేట్‌లు, గ్లాసులు ఇవ్వలేదు. కేవలం ఒక రగ్గు మాత్రమే ఇచ్చారు. దీంతో విద్యార్థులు సొంత ఖర్చులతో అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇక మంచాలు, పాత ట్రంకు పెట్టెలు ఓ గదిలో మూలనపడ్డాయి.



అధ్వానంగా బాత్ రూంలు



ఈ ట్యాంకు వద్దే ఉదయం స్నానం చేయాల్సింది..

260 మందిలో 138 మందికే ప్రవేశం..

వివిధ కారణాలతో ఈ విద్యా సంవత్సరంలో 6 – 10వ తరగతి వరకు 138 మంది మాత్రమే హాస్టల్‌లో ఉంటున్నారు. వాస్తవంగా ఏటా 260 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించేవారు. పాతకాలం నాటి భవనం కావడం, భోజనం, సౌకర్యాలు లేకోవడంతో తక్కువ సంఖ్యలో విద్యార్థులను చేర్చుకున్నారు.

వర్షం వస్తే అంతే సంగతులు



ఇంతకు ముందు వర్షం వస్తే హాస్టల్‌లోనే తడుస్తూ..రాత్రంతా జాగరణ చేసేవాళ్లం. కొన్నిసార్లు హైస్కూల్‌కు పరుగులు తీసేవాళ్లం. భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకోస్తుందో తెలియదు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నాం. అందుకే రాత్రయితే హైస్కూల్ గదులకు చేరుకుంటాం. – అభిషేక్, 8వ తరగతి విద్యార్థి

కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బంది



మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నా శిథిలమయ్యాయి. దీంతో కాలకృత్యాలకు గ్రామ శివారుకు వెళ్తాం. స్నానాలకు హాస్టల్ వద్ద అరుబయటే ట్యాంకు, బోర్లు వద్ద చేస్తున్నాం. ప్రతిరోజూ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ చదువుకుంటున్నాం. కొత్త భవనం ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించాలి.
– మల్లికార్జున, 9వ తరగతి విద్యార్థి

గదుల మరమ్మతుకు రూ.68.5 లక్షలతో ప్రతిపాదనలు



హాస్టల్ పై కప్పు, గదుల మరమ్మతుకు రూ.68.5 లక్షలతో జూలైలో బీసీ వెల్ఫేర్ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాం. ఇంకా రిప్లై రాలేదు. ఇక పిల్లల భోజన ఖర్చులు ఆగస్ట్ నెల నుంచి ఇవ్వలేదు. దీంతో ఇబ్బందిగా ఉంది. హాస్టల్‌లో మరుగుదొడ్లు, స్నానపు గదులు బాగలేకపోవడం ఇతర సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు.
– శివుడు, ఇన్‌చార్జ్ వార్డెన్

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

ఆస్పరి: సమస్యలు ఎదురైనప్పుడు కృంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లాలని ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ విద్యార్థినులకు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ×ఓ చెల్లెమ్మ జర జాగ్రత్త× అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థినులు చదువులో బాగా రాణించి ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. మధ్యలో బడి మానెయ్యకూడదన్నారు. పాఠశాలలు దగ్గర ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. చదువుకుంటేనే భవిష్యత్ బాగుంటుందన్నారు. అనంతరం విద్యార్థినులు ట్రైనీ డీఎస్పీని శాలువ, పూలమాలలతో సన్మానించారు.



ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీని సన్మానిస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు జీవిత, ఉపాధ్యాయులు మల్లేష్, ధనలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, తరుణ్, మహేష్ పాల్గొన్నారు.

పుడమిని సంరక్షించుకోవాలి



భూసార పరీక్ష ఫలితాల పత్రాలను రైతులకు అందిస్తున్న ఏడీఓ మోహన్ విజయ్‌కుమార్

పత్తికొండ(తుగ్గలి) : పంటలు సాగుచేసే ప్రతి రైతు నేల తల్లిని సంరక్షించుకోవాలని ఇందుకు సహజ సిద్ధమైన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని పత్తికొండ మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటరాముడు అన్నారు. గురువారం దేవనబండలో ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. భూమి ఆరోగ్యాన్ని కాపాడితేనే భవిష్యత్‌లో మనకు రక్షణ ఉంటుందన్నారు. వరదలు, గాలి, రసాయన వ్యవసాయం, భూ వినియోగ మార్పులు, అటవీ నిర్మూలన, కాలుష్యం, ప్లాస్టిక్, రసాయన వ్యర్థాల చేరిక వంటి కారణాలతో నేల ఆరోగ్యం దెబ్బ తింటోందని వివరించారు. రైతులు సేంద్రియ ఎరువులు వినియోగిస్తేనే నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఏటా సాగుకు ముందు మట్టి పరీక్షలు చేయించి వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసి దిగుబడులు పొందాలని కోరారు. అనంతరం రైతులకు భూసార ఫలితాల పత్రాలను అందజేశారు. ఏఈవో రియాజ్‌బాషా, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

భూసారాన్ని కాపాడండి

వెల్దుర్తి(కృష్ణగిరి): భూసార పరీక్ష ఫలితాల అనుగుణంగా ఎరువులు వాడి, అధిక దిగుబడి సాధించడంతో పాటు భూసారాన్ని కాపాడుకోవాలని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ రైతులకు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా.. భూసార పరిరక్షణ, నేలను సంరక్షించుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధిక దిగుబడులు సాధించాలనే ఆశతో రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడి భూమి ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేయొద్దని చెప్పారు. ఏఓ అక్బర్ బాషా, ఏఈఓలు విలసిత, అజయ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెండు ఫొటోల విధానం రద్దు చేయాలి

మద్దికెర : ఉపాధి హామీ పథకంలో పనులు చేసేటప్పుడు చేపట్టిన రెండు ఫొటోల విధానం రద్దు చేయాలని ఉపాధి కూలీలు కోరారు. గురువారం మండలంలోని మదనంతపురం గ్రామంలో ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పనులు చేసేటప్పుడు మొదట ఒకసారి ఫొటో, పనులు ముగించేటప్పుడు మరోసారి ఫొటోలు తీస్తుండటంతో సాయంత్రం 4 గంటల అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక మారుమూల పల్లె కావడంతో సర్వర్ రాకపోవడంతో మరింత ఆలస్యమవుతుందన్నారు. ఇలాయితే పనులు చేయలేమన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

సంబంధింత అధికారుల స్పందించి రెండు ఫొటోల విధానం రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గ్రాండ్ క్రిస్మస్

పత్తికొండ(తుగ్గలి) : డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రసంగీకులు బిందెల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హాజరై మాట్లాడారు..ప్రభువైన ఏసు క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నిందితులను అరెస్ట్ చేయాలి

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో గత నెలలో ఉమేష్‌పై దాడి చేసిన ఘటనలో నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని, వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ ఆలూరు తాలూకా అధ్యక్షుడు కత్తి రామాంజనేయులు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులను నీరుగార్చేందుకు కౌంటర్ కేసు నమోదు చేశారని విమర్శించారు. బాధితుడికి అండగా నిలవాల్సిన చట్టమే వ్యతిరేకంగా పనిచేస్తుందనే అనుమానం కలుగుతుందన్నారు.

ఇంటి నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో సొంత స్థలం ఉండి ఇంటి నిర్మాణాలు చేపట్టదలచిన వారు ఆయా గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి అవాస్‌యోజన పథకం అర్బన్ కింద కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలుపుకొని మొత్తం రూ.2.50 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. అలాగే పీఎంఏవై గ్రామీణ్ కింద రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇవ్వనుందని చెప్పారు. అర్హులైన వారందరూ దరఖాస్తుతో పాటు భార్య, భర్త ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు అందజేయాలని సూచించారు. సొంతిల్లు లేని వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఎం ప్రాంతీయ కమిటీ ఎన్నిక

ఆలూరు రూరల్: సీపీఎం ఆలూరు ప్రాంతీయ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గురువారం స్థానిక జ్యోతిబసు భవన్‌లో సీపీఎం ప్రాంతీయ 3వ మహాసభలు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు ప్రాంతీయ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా హనుమంతు, సభ్యులుగా నారాయణ స్వామి, షాకీర్, వెంకటేశులు, కృష్ణ, రత్నమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భవిష్యత్ కార్యచరణలో భాగంగా వేదావతి, నగరడోణ రిజర్వాయర్ల నిర్మాణం, భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం, సీసీ రోడ్లు,డ్రైనేజీ నిర్మాణం,అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి నిర్మాణంతో పాటు ఆలూరు చెరువులో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మించాలని తదితర అంశాలపై తీర్మానించారు. నాయకులు ఈశ్వర్ గౌడ్, ఈరన్న,షేకన్ బీ, నాగారాజు,గోవర్ధన్ ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచండి

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈఓ ఇందిర సూచించారు. మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె, అల్లుగుండు గ్రామాల్లోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేందుకు సూచనలు ఇచ్చారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతగా అందించాలని ఆదేశించారు.

ఈ నంబర్లకు స్పందించొద్దు

హొళగుంద: సైబర్ నేరగాళ్ల ఫోన్‌లకు మెసేజ్ చేసినా, కాల్ చేసి వివిధ పద్ధతుల్లో మోసాలకు పాల్పడే అవకాశాలున్నందున ప్రజలు స్పందించరాదని ఎస్ఐ బాల నరసింహులు గురువారం తెలిపారు. ప్రస్తుతం మండలంలో 94777455913, 37127913091 ఇలాంటి మరి కొన్ని నంబర్లతో కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని, వాటికి స్పందించొద్దని, ఒకవేళ రిప్లై ఇస్తే మూడు సెకండ్లలో సిమ్ హ్యాక్ అయి మీ వివరాలు, ఫోన్ నంబర్లు, అకౌంట్‌లోని డబ్బులు చోరీకి గురవుతాయని చెప్పారు. ముఖ్యంగా 371, 375, 381 నంబర్లతో మొదలయ్యే నంబర్ల నుంచి కాల్స్, మెసేజ్‌లు వస్తుంటాయని జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

పత్తికొండ(తుగ్గలి) : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ జొన్నగిరి నాయకుడు సుంకప్ప కూతురు రమ్య వివాహానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యులు పులికొండనాయక్, మాజీ సభ్యులు నారాయణనాయక్, ఇన్‌చార్జి ఎంపీపీ ఎర్ర నాగప్ప, పీఎంసీ మాజీ చైర్మన్ రఘు, బీసీ సంఘం నాయకులు బండ్లపల్లి వెంకటేశ్వర్లు, పక్కీరప్ప తదితరులు ఆమెను కలిశారు. ప్రభుత్వంపై పోరాటాలు చేస్తూనే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమె సూచించారు.



మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో పార్టీ నాయకులు

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్

పత్తికొండ(తుగ్గలి) : డివిజనన్ వ్యాప్తంగా రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఎస్.భరత్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సదస్సుల నిర్వహణపై తహసీల్దార్లు, నాయకులు, రైతులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు సదస్సులు ఉంటాయని చెప్పారు. భూ సమస్యలు ఉంటే సదస్సుల్లో అర్జీలు ఇస్తే విచారించి పరిష్కరిస్తామన్నారు.

పత్తికొండ మండలంలో..

ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఈనెల 6వ తేదీన హోసూరు, 10 జూటూరు, 12న పందికోన, 17న నలకదొడ్డి, 19న పత్తికొండ, 21న దూదేకొండ, 27న పెద్దహుల్తి, 28న చిన్నహుల్తి, 31న పుచ్చకాయలమాడ, వచ్చే ఏడాది జనవరి 3న దేవనబండ, 4న చక్రాళ్లలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

తుగ్గలిలో..

నేటి నుంచి ఈనెల 28 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. 6న బొందిమడుగుల, 10న ముక్కెల్ల, 11న చెన్నంపల్లి, 13న పెండేకల్లు, 18న కడమకుంట్ల, 19న పగిడిరాయి, 20న జొన్నగిరి, 21 జీ.ఎర్రగుడి, 24న లింగనేనిదొడ్డి, 26న తుగ్గలి, 27న రాతన, 28న ఎద్దులదొడ్డి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు

చిప్పగిరి:నేటి నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి 27వ తేదీ వరకు సదస్సులు కొనసాగుతాయన్నారు.

ఆలూరు రూరల్: రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో సుదీర్ఘ కాలంగా ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ గోవింద్ సింగ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 6 నుంచి జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం మనేకుర్తి, 10న మొలగవల్లి, 11న హత్తిబెళగల్, 12న ఆలూరులో, 13న అరికెరలో, 17న కురుకుంద, 18న హులేబీడు,19న పెద్దహోతూరు, 20న కరిడిగుడ్డం, 21వ తేది ముద్దనగేరి, 26న తుంబళబీడు, 27న కమ్మరచేడు, 28న మూసానహళ్లి, 31న కాత్రికి, జనవరి 2న గోనేహాల్,3న అంగస్కల్,4 మరకట్టు, 7వ తేదీన కురువళ్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులు జరిపిస్తామని చెప్పారు.

హొళగుంద: మండలంలో ఈనెల 6నుంచి జనవరి 1వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సతీష్ గురువారం విలేకరులకు తెలిపారు. 6న చిన్నహ్యాట, 10న ఎల్లార్తి, 11న నెరణికి, 12న హెబ్బటం, 13న లింగదహళ్లి, 17న వందవాగిలి, 18న గజ్జహళ్లి, 19న సుళువాయి, 20న సమ్మతగేరి, 21న మార్లమడికి, 24న కోగిలతోట, 26న హొళగుంద, 27న నాగరకణ్వీ, 28న హొన్నూరు, 31న ముగుమానుగుంది, జనవరి 2న ముద్దటమాగి, 3న ఇంగళదహాళ్, 4న మద్దిలింగదహళ్లి, 7న పెద్దగోనెహాళ్, 8న పెద్దహ్యాట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వివరించారు.

హాలహర్వి: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నజ్మాబాను తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన బల్లూరు, సిద్ధాపురం, అమృతాపురం, 10న బాపురం, పచ్చారపల్లి, 11న విరుపాపురం, బల్గోట, కుర్లేహళ్లి, 12న బిలేహాల్, 13న టి.సాకిబండ, బేవినహాల్, శ్రీధర్ హాల్, 17న సిరుగాపురం, చింతకుంట, 18న కొక్కరచేడు, ఎం.కె.పల్లి, 19న కామినహాల్, మెదేహాల్, 20న అర్థగేరి, 21న హాలహర్వి, మాచనూరు, 24న నిట్రవట్టి, 26న గూళ్యం, జె.హొసళ్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

చెట్టు కింద బోధన.. విద్యార్థుల వేదన

చిప్పగిరి: మండలంలోని నగరడోణ ప్రాథమికోన్నత పాఠశాలలో మౌలిక వసతులు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 1–8వ తరగతి వరకు నిర్వహిస్తుండగా.. మొత్తం 220 మంది అభ్యాసకులు చదువుకుంటున్నారు. పాఠశాలలో విద్యార్థుల కోసం కేవలం 5 గదులు మాత్రమే ఉండగా మిగిలిన మూడు తరగతుల విద్యార్థులు ఇలా ప్రకృతి ఒడిలో చదువుకోవాల్సి వస్తోంది. తరగతి గదుల కొరతతో కొన్ని తరగతుల విద్యార్థులకు ఉపాధ్యాయులు చెట్టు కింద కూర్చోబెట్టి బోధిస్తున్నారు. కొందరు చెట్టు కింద నీడలో కూర్చోగా..మరికొందరు ఎండలో కూర్చొని పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు ప్రధాన రహదారి కావడంతో వాహనాల శబ్దాలు వారి ఏకాగ్రతకు తీవ్ర ఆటంకంగా మారింది. మధ్యాహ్న భోజనం వండడానికి కూడా గది లేక అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని తల్లిదండ్రులు, మధ్యాహ్న వంట నిర్వాహకులు కోరుతున్నారు.



నగరడోణలో చెట్టు కింద పాఠం బోధిస్తున్న హెచ్ఎం మహమ్మద్ రఫీ

పెద్ద చీమల పుట్ట

చీమలు పెట్టే పుట్టలు ఎక్కువగా నిర్జన ప్రదేశాల్లో కనిపిస్తుంటాయి. పెండేకల్లు నుంచి ఎద్దులదొడ్డికి వెళ్లే రోడ్డు పక్కన పాడుబడిన పురాతన శివాలయంలో చీమలు పెట్టిన పుట్టతో ఆలయ ద్వారం మూసుకుపోతోంది. నాగుల చవితి రోజు భక్తులు ఈ పుట్టలో పాలు పోసి పూజలు చేస్తారు.
– తుగ్గలి



పెండేకల్లు శివాలయంలో చీమలు పెట్టిన పుట్ట